

లేపాక్షి ఆలయం వ్యూ

ప్రతిపాదనల్లోనే పర్యాటకాభివృద్ధి..!

- నివేదికలు సిద్ధం
- ఏడాదిన్నరగా ముందుకు కదలని వైనం

జిల్లాలో ఎన్నెన్నో అనుకూలతలు


బుక్కపట్నం చెరువు


గొల్లపల్లి రిజర్వాయర్

శిల్పకళల కాణాచి లేపాక్షి.. రాయల రెండో రాజధాని పెనుకొండ, తిమ్మమ్మ మర్రిమాను, ఖాద్రీశుడి ఆలయం, ధర్మవరం పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ పక్షుల విడిది కేంద్రం వీరాపురం ఇలా.. ఎన్నెన్నో చారిత్రక ప్రత్యేకతలు. హంద్రీనీవా నీటితో రిజర్వాయర్లు, పెద్ద చెరువులు కళకళలాడుతున్నాయి. పర్యాటకాభివృద్ధికి లెక్కకు మిక్కిలి అనుకూలతలు ఉన్నాయి. ఆదాయ వనరులను సమకూర్చుకునే స్థాయికి జిల్లాలో పర్యాటకాభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ప్రతిపాదనలు కూడా వెళ్లాయి. ఇక, అక్కడితో ఆగిపోయింది. అడుగు కూడా ముందుకు పడట్లేదు. ఎందుకో, ఏమో..?

పుట్టపర్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యాటక ప్రాంతాలకు పెట్టింది పేరు. గత వైసీపీ ప్రభుత్వంలో పర్యాటక రంగాన్ని పూర్తిగా విస్మరించారు. గతేడాది అధికారం చేపట్టిన కూటమి.. పర్యాటక రంగానికి వన్నెతెచ్చేలా జిల్లాను పర్యాటక ఆదాయ వనరుగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యాటక శాఖ సమీక్షలో జిల్లా పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ ప్రారభించారు. కలెక్టర్ల సదస్సులో జిల్లా ప్రగతి నివేదికలో పర్యాటకంగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలనీ, అందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేశారు. నవంబరులో సత్యసాయి శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు పుట్టపర్తిలో అభివృద్ధి పనులు మొదలు పెట్టారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో లేపాక్షి ఉత్సవాలను ఘనంగా చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. లేపాక్షి, పెనుకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ అతిథులు విడిదిచేసే వీరాపురం, ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరం చేనేత పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, తిమ్మమ్మ మర్రిమాను ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లా అంతటా పర్యాటక, చారిత్రాక సంపద, కళాకృతులే కనిపిస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. జిల్లాకు పర్యాటకంగా ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించే దిశగా చేస్తున్న ప్రయత్నాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. పర్యాటక అభివృద్ధికి అన్ని అనుకూలతలు ఉన్నా.. జిల్లాలో నిధులు విడుదల చేసి పనులు వేగం పెంచితేనే ఆ ఫలితాలు అందుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బోటింగ్‌కు అనుకూలతలు ఉన్నా..

హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులకు జలకళ వచ్చింది. బుక్కపట్నం, ధర్మవరం చెరువులతోపాటు గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజయర్వాయర్లు నీటితో తొణికిసలాడుతున్నాయి. వాటిలో బోటింగ్ అనుకూలతలపై పర్యాటక శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. బుక్కపట్నం చెరువులో మాత్రమే ప్రైవేటు బోటింగ్ ఏర్పాటు చేశారు. సెలవులు, పండుగ రోజుల్లో పర్యాటకుల తాకిడి ఉంటోంది. బోటింగ్ మాత్రమే ఉండడం, ఇతర ప్రత్యేకతలు లేకపోవడంతో పర్యాటకులు కొంత అసంతృప్తితో వెళ్తున్నట్లు తెలుస్తోంది. గొల్లపల్లి రిజర్వాయర్‌కు నిత్యం పర్యాటకులు వస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పెనుకొండ, గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద పర్యాటక అభివృద్ధి పనులు చేపడతామనీ, బోటింగ్ ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఏడాది గడిచినా బోటింగ్ కూడా ఏర్పాటు చేయించలేకపోయారని పర్యాటకులు ఆవేదన చెందుతున్నారు. ధర్మవరం చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పిస్తే పర్యాటకులకు ఆహ్లాదం పంచే అవకాశాలున్నాయి. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అన్ని అవకాశాలు ఉన్నా.. ప్రతిపాదనలతో సరి పెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


చిత్రావతిలో నదిలో బోటింగ్

వన్నె తెచ్చేదెన్నడో?

జిల్లాను టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద అభివృద్ధి చేసేందుకు 2024 సెప్టెంబరు నుంచి కలెక్టర్ అధ్యక్షతన పలుమార్లు పర్యాటక, పురావస్తు, దేవదాయ, అటవీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల్లో ప్రాజెక్టులను గుర్తించి, ప్రతిపాదనలు చేశారు. లేపాక్షిలో జటాయువు థీమ్ పార్కు, ఫుడ్ కోర్టు, స్టాల్స్ పర్యాటకులకు అదనపు గదులు, మౌలిక సదుపాయాల కల్పన, ఓపెన్ ఆడిటోరియం, మడకశిర కోటలో అడ్వెంచర్ స్పోర్ట్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. గొల్లపల్లి రిజర్వాయర్, యోగివేమన ప్రాజెక్టుల్లో బోటింగ్, తనకల్లు మండలం కోటపల్లిలో రేస్‌ట్రాక్, థీమ్ లగ్జరీ రిసార్ట్ పీపీపీ పద్ధతిలో నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే పుట్టపర్తి వద్ద చిత్రావతి నదిలో, బుక్కపట్నం చెరువులో ప్రైవేటు బోటింగ్ ఏర్పాటు చేయడంతో పర్యాటక శోభ తీసుకొచ్చారు. ఇంకా జిల్లాలో ఎక్కడెక్కడ బోటింగ్‌కు అవకాశం ఉందో ఆరాతీసి, ప్రతిపాదనలు రూపొందించారు. అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో పెనుకొండకు దేశవిదేశీయుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో రాయల రెండో రాజధాని పెనుకొండ కొండలో పర్యాటకాభివద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని లేపాక్షి, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, అన్నమయ్య జిల్లాలోని హార్సిలీహిల్స్‌ను బెంగళూరుతో అనుసంధానిస్తూ పర్యాటక వలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కూటమి అధికారం చేపట్టి 15 నెలలు గడిచిపోయాయి. ప్రతిపాదనలను పరుగులు పెట్టించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయ వనరులను సృష్టించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. లేపాక్షిలో రూ.102 కోట్ల అభివృద్ధి పనులకు కేంద్ర పర్యాటక, మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపాం. గొల్లపల్లి, యోగివేమన రిజర్వాయర్లలో బోటింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.

-నరసయ్య, జిల్లా పర్యాటక శాఖాధికారి

ఇళ్ల మధ్యలో దీపావళి బాంబులు



- పొంచి ఉన్న బాణసంచా ప్రమాదం
- అనధికారిక నిల్వలపై చర్యలు పట్టవా..?

6

జేసీగా మౌర్య భరద్వాజ్



పుట్టపర్తి టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్(జేసీ)గా మంత్రి మౌర్య భరద్వాజ్‌ను ప్రభుత్వం నియమించింది. కర్నూలు జిల్లా ఆదోని సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను జేసీగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ జేసీగా పనిచేస్తున్న అభిషేక్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు సీఈఓగా బదిలీ చేసింది. ఈయన జేసీగా 22 నెలలపాటు పనిచేశారు.

మాది మహిళా పక్షపాత ప్రభుత్వం

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- గోరంట్లలో ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

గోరంట్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి మంది విద్యార్థినులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత, కలెక్టర్ శ్యాంప్రసాద్ హాజరై శాంతికపోతాలను ఎగురవేశారు. అనంతరం ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ పాఠశాల నుంచి గోరంట్ల ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వరకు కొనసాగింది. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ అనుకుంటే బాలికలు మహిళలు సాధించలేనిది లేదన్నారు. దివంగత ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహిళలకు ఆస్తి హక్కును కల్పించారని, అదే స్ఫూర్తితో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సాధికారతకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడాలని, అమ్మ పేరుతో మొక్కను నాటి, సంరక్షించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి బాలిక చదువుకొని ఉన్నత స్థాయిని అధిరోహించాలని సూచించారు. విద్యతోనే అన్ని హోదాలు అందుతాయన్నారు. బాలికలు, మహిళలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి, పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమకు క్రీడా మైదానం లేదని తెలపగా కలెక్టర్ వెంటనే క్రీడా మైదానాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థినులు పాఠశాల ప్రాంగణంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీపీఓ సమత, తహసీల్దార్ మారుతీ ప్రసాద్, ఎంపీడీఓ కమలాబాయి, ప్రధానోపాధ్యాయురాలు బి.ఈశ్వరప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి బహిష్కరణ

- బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయుల స్వస్తి


కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కొత్తచెరువు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బోధనేతర కార్యక్రమాలను శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈమేరకు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు గురువారం సమాచారం అందజేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఫ్యాప్టో నిర్ణయం మేరకు ఈనెల 10 నుంచి ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పనులు, మూల్యాంకానికి సంబంధించిన పనులు తప్ప.. మిగతా బోధనేతర పనులన్నీ బహిష్కరిస్తున్నామన్నారు. ఈమేరకు విద్యాశాఖ ఏడీ-1 శ్రీనివాసులు, ఏడీ-2 వినయ్‌మోహన్‌కు విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ గౌస్‌లాజం, కార్యవర్గసభ్యులు ఆర్.చంద్ర, సుధాకర్, బడాహరిప్రసాద్, షమీవుల్లా, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ 1938 ప్రధానకార్యదర్శి సురేంద్ర, రమణారెడ్డి, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు వైకల్య పరీక్షలు

- 4 ఆస్పత్రుల్లో ఏర్పాట్లు
- కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వికలాంగ పరీక్షల్లో అర్హత పొందని పింఛన్‌దారులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 4 ఆస్పత్రుల్లో శుక్రవారం పునఃపరిశీలన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గతంలో దివ్యాంగ పింఛన్ పొందుతూ వైద్య పరీక్షల్లో అర్హత కోల్పోయిన వారు రీఅసెస్మెంట్ కోసం నమోదు చేసుకున్నారన్నారు. అలాంటి వారికి మడకశిర, కదిరి, ధర్మవరం ఏరియా ఆస్పత్రుల్లో శారీరక వైకల్య పరీక్షలు చేస్తారన్నారు. హిందూపురం జిల్లా ఆస్పత్రిలో చూపు, వినికిడి, బుద్ధిమాంద్యం, మానసిక వైకల్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఇకపై ప్రతి బుధ, గురు, శుక్ర వారాల్లో మూడు రోజులపాటు ఆ ఆస్పత్రుల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో మొత్తం 5,207 మంది పునఃపరిశీలనకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరందరికీ సచివాలయం స్థాయిలో నోటీసులు జారీ చేశారన్నారు. వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేరాలను నియంత్రిస్తాం: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

మడకశిర, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో జరుగుతున్న పలు నేరాలను పూర్తిస్థాయిలో నియంత్రిస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం మడకశిర అప్‌గ్రేడ్, రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి పోలీస్‌స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, లాకప్‌గదులు, కమాండ్ కంట్రోల్ రూమ్, మహిళా హెల్ప్‌డెస్క్, స్టేషన్ పరిసరాలు, పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మడకశిర ప్రాంతంలో నేరాలను అరికట్టడానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈక్రమంలోనే నేరస్థులను గుర్తించడానికి మడకశిరలో 32 అధునాతన సీసీ కెమెరాలు అమర్చామన్నారు. త్వరలో పంచాయతీ ఎన్నికలు ఉన్నందున శాంతి భద్రతల పరిరక్షణ, గ్యాంబ్లింగ్, మట్కా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గ్యాంబ్లింగ్ నిర్వాహకులపై కేసులు పెట్టి, కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. జిల్లాలో అధిక వడ్డీకి వ్యాపారం చేసేవారిపైన కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే జిల్లాలో పాతుకు పోయిన పాత హోం గార్డులను బదిలీ చేశామని, ఆయా ప్రాంతాలకు కొత్త హోం గార్డులను నియమిస్తామని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాను నేర రహితంగా మార్చడానికి కృషి చేస్తామన్నారు. ఎస్పీ వెంట పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప, సీఐలు నాగేష్‌బాబు, రాజ్‌కుమార్, ఎస్‌ఐలు ఉన్నారు.

ఆడ, మగ తేడా వద్దు

- స్త్రీ, పురుష సమానత్వంతో సమాజాభివృద్ధి
- సినీ దర్శకుడు ఉమామహేశ్వరరావు
- అనంతలో మొదలైన ఐద్వా సాంస్కృతికోత్సవాలు



చిన్నారుల నృత్య ప్రదర్శన

7

విత్తుతోచని రైతు..!

ముందస్తు వర్షాలతో పప్పుశనగ సాగుకు సమాయత్తం.. బెళుగుప్ప మండలంలో ఊపందుకున్న విత్తు

- నేటికీ అందని సబ్సిడీ విత్తనం
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా మొదలవని దుస్థితి
- బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొంటున్న కొందరు అన్నదాతలు
- ఆర్థిక ఇబ్బందులతో దిక్కుతోచని స్థితిలో మరికొందరు
- విత్తన సరఫరాకు బకాయిల సమస్య



బెళుగుప్ప మండలంలో పప్పుశనగ విత్తుతున్న రైతులు

ముందస్తు వర్షాలతో పదునైంది. ఆరిపోతోంది కూడా. పప్పుశనగ విత్తుకు సరైన అదును కూడా. అన్నదాతలు ఆశల సాగుకు సమాయత్తమవుతున్నారు. బెళుగుప్ప మండలంలో ఇప్పటికే విత్తు జోరందుకుంది. పక్షం రోజుల్లో పూర్తవనుంది కూడా. మిగతా ప్రాంతాల్లో త్వరలోనే విత్తనం వేయనున్నారు. నేటికీ సబ్సిడీ విత్తనం అందలేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా మొదలవలేదు. ఎప్పుడు ఇస్తారో తెలీదు. చెప్పేవారు కూడా లేరు. దీంతో అన్నదాతలు ఆశలు వదులుకుంటున్నారు. కొందరు బయట మార్కెట్‌లో అధిక ధరలకు విత్తనాలు కొని, పంట వేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మరికొందరు రైతులు నిరీక్షిస్తున్నారు. బయట కొనేందుకు డబ్బుల్లేక, సబ్సిడీ విత్తనం ఇవ్వక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విత్తన సరఫరాకు బకాయిలు సమస్యగా మారాయి. వాటిని చెల్లిస్తేనే సరఫరా చేస్తామంటూ ఆయా సంస్థలు మొండికేస్తున్నాయి.

అనంతపురం అర్బన్/బెళుగుప్ప/యాడికి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పప్పుశనగ విత్తు జోరుగా సాగుతోంది. ఈసారి సీజన్‌కు ముందుగానే పదును వర్షాలు పడటంతో నల్లరేగడి భూముల్లో సేద్యం పనులు పూర్తి చేసుకున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఎక్కువగా పదునైంది. బెళుగుప్ప మండలంలో పదును ఆరటంతో ముందస్తుగానే పప్పుశనగ విత్తనం మొదలు పెట్టారు. ఐదు రోజులుగా విత్తనం వేస్తున్నారు. మండలంలో ఏటా 15వేల ఎకరాలకుపైగా పప్పుశనగ సాగు చేస్తున్నారు. వారం రోజుల్లోనే 2వేల ఎకరాలకు పైగా పప్పుశనగ విత్తనం వేశారు. పక్షం రోజుల్లో పూర్తిస్థాయిలో విత్తనం వేసే అవకాశం ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

బెళుగుప్ప మండలంలో పదును ఆరడంతో పప్పుశనగ విత్తనం జోరుగా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో చిన్న, సన్నకారు రైతులకు చుక్కెదురైంది. సబ్సిడీ విత్తనం ఇస్తారని వారంతా ఆశతో ఎదురుచూశారు. ఇతర రైతులు విత్తనం వేస్తుండటంతో తప్పని పరిస్థితుల్లో అప్పులు చేసి బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.6,200కి కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు సబ్సిడీ విత్తనాల కోసం నిరీక్షిస్తున్నారు. మండలంలో పప్పుశనగ విత్తనం పూర్తిగా వేసిన తర్వాత సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తారా..? అంటూ రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సబ్సిడీ విత్తనం దళారులపాలవ్వడం ఖాయమనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు మండలాల్లో సబ్సిడీ విత్తనం రాగానే తాము కోరిన మేర విత్తనాలు ఇవ్వాలంటూ కొందరు నాయకులు.. అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఉరవకొండ నియోజకవర్గంలోని మిగతా మండలాల్లో ఇంకా పదును ఆరలేదు. పదును ఆరగానే పప్పుశనగ విత్తనం వేసేందుకు ఆయా ప్రాంతాల రైతులు సిద్ధంగా ఉన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోని మండలాల్లో మరోసారి వర్షం పడితే విత్తనం వేసేందుకు సమాయత్తమవుతున్నారు.



బెళుగుప్ప మండలంలో పప్పుశనగ విత్తన శుద్ధి చేస్తున్న రైతు

విత్తన పంపిణీపై నిర్లక్ష్యం

ఎన్నడూ లేనివిధంగా ఈసారి సబ్సిడీ పప్పుశనగ విత్తన పంపిణీపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ నెలారంభం నుంచి రబీ సీజన్ ఆరంభమైంది. ఏటా రబీ సీజన్‌లో 55వేల హెక్టార్లకుపైగానే పప్పుశనగ పంట సాగవుతోంది. సెప్టెంబరు 29వతేదీన ప్రభుత్వం సబ్సిడీ ధరలు ఖరారు చేసింది. పప్పుశనగ జేజీ-11 రకం క్వింటా పూర్తి ధర రూ.7800గా నిర్ణయించారు. ఇందులో 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద క్వింటా ధర రూ.5,850 చెల్లించాల్సి ఉంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా ఐదెకరాలకు 10 బస్తాల (బస్తా 20 కేజీలు) పప్పుశనగ పంపిణీ చేయాలని నిర్ణయించారు. గతేడాది జిల్లాకు 27వేల క్వింటాళ్ల పప్పుశనగను కేటాయించారు. ఈసారి 14వేల క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. జిల్లాలో ఎక్కువ శాతం మంది సబ్సిడీ విత్తనాలపైనే ఆధారపడి పంటను సాగు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఈసారి పప్పుశనగ కేటాయింపులు పెంచాలని రైతులు, రైతుసంఘాల నాయకులు కోరుతున్నారు. గతేడాది అక్టోబరు 1వతేదీ నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెట్టారు. గతంలో అక్టోబరు రెండోవారం నుంచి విత్తన పంపిణీని ప్రారంభించేవారు. ఈసారి నేటికీ పప్పుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించపోవడం విమర్శలకు తావిస్తోంది.

బకాయిలే సమస్య..

గతేడాది రబీ సీజన్‌లో పప్పుశనగ సరఫరాకు సంబంధించిన రూ.40కోట్ల బకాయిలు ఉన్నాయి. దీంతో ఈసారి సరఫరా మొదలు పెట్టలేదు. బకాయిలు చెల్లిస్తేనే.. సరఫరా మొదలు పెడతామని సంబంధికులు మొండికేశారు. విత్తన సరఫరాకు టెండర్లు నిర్వహించనప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతున్నా.. ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆఖరుకు సబ్సిడీ ధరలు ఖరారు చేసినా.. క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాలకు పప్పుశనగ విత్తనాలు సరఫరా చేయలేని పరిస్థితి. ఇంత జరుగుతున్నా పాలకులు పట్టనట్లు వ్యవహరిస్తుండటం ఏమిటో అర్థంకావడంలేదని రైతులు వాపోతున్నారు.

బెళుగుప్ప మండలంలో ఇప్పటికే పప్పుశనగ విత్తనం వేయడం మొదలైంది. ఐదెకరాలకుపైగా పొలం ఉన్న రైతులు బహిరంగ మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. చిన్నసన్నకారు రైతులు సబ్సిడీ విత్తనాల కోసం నిరీక్షిస్తున్నారు. పదును ఆరిపోతుందనే భయంతో మరికొందరు రైతులు అప్పులు చేసి, బహిరంగ మార్కెట్‌లోనే విత్తనాలు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా పప్పుశనగ సరఫరాపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేదంటే జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులపై అదనంగా ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. మరి ఏ మేరకు ప్రభుత్వ పెద్దలు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

అదును దాటిపోయాక పంపిణీ చేసి.. ఏం లాభం?



పప్పుశనగ విత్తుకు ఇది సరైన సమయం. ఇంతవరకు సబ్సిడీ విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియే మొదలుపెట్టలేదు. ఇక విత్తనం ఎప్పుడు పంపిణీ చేస్తారు? అదును దాటిపోయాక పంపిణీ చేసి, ఏం లాభం? అదునులోనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి. రైతులకు అవసరమైన మేర ఇవ్వాలి.

-నాగేంద్రరెడ్డి, రైతు, భోగాలకట్ట, యాడికి మండలం

విత్తనమే రాలేదంటున్నారు..



సబ్సిడీ విత్తన పప్పుశనగ కోసం అధికారులను అడిగితే ఇంకా స్టాక్ రాలేదని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా మొదలు పెట్టలేదు. పప్పుశనగ విత్తనం ఇంకెప్పుడు పంపిణీ చేస్తారు? సకాలంలో రైతులకు విత్తన పప్పుశనగ పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలి.

-జగదీష్, రైతు, ఎన్. కొత్తపల్లి, యాడికి మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



బెళుగుప్ప మండలంలో పప్పుశనగ విత్తన పంపిణీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మండలానికి 3,500 క్వింటాళ్లు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపాం. బహిరంగ మార్కెట్‌లో రైతులు కొనుగోలు చేసి, విత్తనం వేస్తున్నారని, తక్షణమే పంపిణీ మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరాం. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -పృథ్వీసాగర్, వ్యవసాయ అధికారి, బెళుగుప్ప మండలం

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- సూపరింటెండెంట్ అమర్‌నాథ్
- ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న సూపరింటెండెంట్ అమర్‌నాథ్, తపాలాశాఖ ఉద్యోగులు, సిబ్బంది

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): తపాలశాఖ అందించే సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ అమర్‌నాథ్ కోరారు. ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సూపరింటెండెంట్ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... తపాలా సేవలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14వతేదీ వరకూ విద్యార్థులకు పలు పాఠశాలల్లో ఉచిత ఆధార్ సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం నగరంలోని విశ్వభారతి పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- దెబ్బతిన్న అరటి తోటలు
- వంగపేరులో ట్రాక్టర్ బోల్తా



వసంతపురంలో నేలకొరిగిన అరటిచెట్లను చూపుతున్న రైతు కమతం చిన్నకాటమయ్య

ధర్మవరం రూరల్, కొత్తచెరువు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాలలో బుధవారం రాత్రి, గురువారం ఉదయం గాలివానలు తోట పంటలను దెబ్బతీసింది. ధర్మవరం మండలంలో అరటి తోటలు నేలకొరిగాయి. చిగిచెర్లలో రైతు తాడిమర్రి చెన్నారెడ్డి, వసంతపురంలో రైతు కమతం చిన్నకాటమయ్యకు చెందిన అరటి చెట్లు నేలకొరిగాయి. దిగుబడి వచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులకు తీవ్రంగా నష్టపోయారు. భారీ వర్షానికి కుంటలు నిండి, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కొత్తచెరువు మండలం వంగంపల్లి సమీపంలో వంగపేరు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో రైతు ధర్మపురి వెంకటేశ్ ఆరబోసిన మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా నీటి ఉధృతికి బోల్తా పడింది. దీంతో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. రూ.40 వేలు నష్టపోయానని బాధిత రైతు తెలిపారు. ట్రాక్టర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు.



ఇరగంపల్లి సమీపాన వంగపేరులో బోల్తాపడిన ట్రాక్టర్

గురువుల ఉద్యమబాట

- డిమాండ్ల సాధనకు నేటి నుంచి నిరసనలు
- ఫ్యాప్టో పిలుపుతో బోధనేతర పనుల బాయ్‌కాట్

అనంతపురం విద్య, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం ఉపాధ్యాయులు ఉద్యమబాట పడుతున్నారు. డీఏ, పీఆర్సీ తదితర బకాయిల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు. బోధనేతర పనుల నుంచి తమను తప్పించాలని కోరుతున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించలేదని, పీఆర్సీని నియమించి మధ్యంతర భృతి ప్రకటించలేదని, పెండింగ్ డీఏలు చెల్లించలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు విద్యారంగంలో సంస్కరణల పేరుతో తెస్తున్న మార్పులను పలువురు ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 7న విజయవాడలో పోరుబాట నిర్వహించారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేదాకా అన్ని జిల్లాల్లో ఉద్యమం కొనసాగించాలని ఫ్యాప్టో నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలో నిరసన విషయమై కలెక్టర్ ఆనంద్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు.



కలెక్టరు ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నేతలు

నేటి నుంచే..

రాష్ట్ర విద్యాశాఖ అమలు చేస్తున్న వివిధ రకాల బోధనేతర (ఆన్‌లైన్) కార్యక్రమాలను చేయకూడదని ఫ్యాప్టో నిర్ణయం తీసుకుంది. ఈ నిరసనకు శుక్రవారం నుంచే టీచర్లు శ్రీకారం చుడుతున్నారు. ఉపాధాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాల వివరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 13 నుంచి ఎఫ్ఏ-2 పరీక్షలు నిర్వహించినా, మూల్యాంకనం చేసి మార్కులు రికార్డుల్లో మాత్రమే నమోదు చేసి, ఆన్‌లైన్‌లో చేయకూడదని నిర్ణయం తీసుకున్నారు. నిరసనలో భాగంగా కలెక్టరు, డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలకు వినతిపత్రాలు అందజేయనున్నారు.

ఏడాదిన్నర దాటినా..



ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నాం. ఏడాదిన్నర దాటినా పరిష్కరించడం లేదు. సంస్కరణల పేరుతో వివిధ బోధనేతర పనులు అప్పగించి టీచర్లను ఇబ్బంది పెడుతున్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నాం. జిల్లాలో కూడా నిరసనలు తెలియజేస్తాం.

- శ్రీనివాసనాయక్, ఫ్యాప్టో జిల్లా చైర్మన్

వ్యతిరేకత లేకుండా చూసుకోవాలి..



ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఇప్పటివరకు ఉపాధ్యాయవర్గాల్లో ప్రభుత్వంపై అసంతృప్తి మాత్రమే ఉంది. ఇది వ్యతిరేకతగా మారకుండా ప్రభుత్వం చూసుకోవాలి. నిర్లక్ష్యం చేయకుండా ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పెద్దలు స్పందించి సమస్యలు పరిష్కరించాలి. డిమాండ్లు తీరేంత వరకు బోధనేతర పనులను బాయ్‌కాట్ చేస్తాం.

-వెంకటరత్నం, ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ

హామీలు అమలు చేయాలి..



వైసీపీ ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ ఇచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేసింది. దాన్ని ప్రశ్నించకుండా భయపెట్టింది. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాలను తెలుపుతూ, తాము అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు తీరుస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. ఆ హామీలను త్వరగా నెరవేర్చాలి. అప్పటివరకు ఇలాగే ఉద్యమాలు కొనసాగిస్తాం.

-రమణారెడ్డి, ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ

ఇళ్ల మధ్యలో దీపావళి బాంబులు

- పొంచి ఉన్న బాణసంచా ప్రమాదం
- అనధికారిక నిల్వలపై చర్యలు పట్టవా..?

హిందూపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దీపావళి దగ్గరపడింది. బాణసంచా విక్రయాలకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. భారీగా నిల్వలను తెప్పించి.. జనావాసాల నడుమ, అనధికారిక గోడౌన్లలో నిల్వ చేస్తున్నారు. నిబంధనలు పాటించకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. హిందూపురంలో బాణసంచా వ్యాపారం చేసే ఇద్దరికి మాత్రమే గోదాములకు అనుమతి ఉంది. ఒకరికి పెనుకొండ నియోజకవర్గ పరిధిలో, మరొకరికి హిందూపురంలో గోడౌన్‌లు ఉన్నాయి. ఈ రెండూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని అధికారులే అంటున్నారు. కానీ చర్యలు తీసుకోవడం లేదు. హిందూపురం ప్రాంతంలో నిబంధనలకు అనుగుణంగా ఒక్క గోడాన్ కూడా లేదు. మడకశిర, పెనుకొండ, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి సహా అన్ని మండల కేంద్రాల్లో ఒకరిద్దరికి మాత్రమే బాణసంచా విక్రయాలకు అనుమతులు ఉంటాయి. కానీ ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 30మంది ఏడాది పొడవునా బాణసంచా విక్రయిస్తున్నారు. రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది.



గతేడాది పరిగిలో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన టపాసులను సీజ్ చేసిన పోలీసులు

ప్రమాదాలు జరిగితే..?

దీపావళి సమయంలో ప్రమాదాలు పరిపాటిగా మారాయి. అధికారులు పాఠాలను నేర్వడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచాను నిల్వ ఉంచిన గోదాముల వద్ద ప్రమాదాలు జరిగినప్పుడు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. ఇలాంటి సంఘటన జరిగితే తప్ప అధికారుల్లో చలనం కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో చాలా మంది వ్యాపారులు ఇళ్ల మధ్యలోనే బాణసంచా నిల్వ చేశారని సమాచారం. రాజకీయ పార్టీల ర్యాలీలు, విజయోత్సవాలు, పెళ్లిళ్ల సమయంలో లక్షలాది రూపాయల బాణసంచా పేలుస్తున్నారు. ఇదంతా అనధికారిక గోడౌన్‌ల నుంచే వస్తోందని అధికారులకు తెలుసు. అయినా అప్రమత్తం కావడం లేదు. దీపావళికి ఏటా హిందూపురంలోనే 20మందికి పైగా తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేస్తున్నారు. సరుకు 60 శాతమే అమ్ముడుపోతోంది. మిగిలిన 40 శాతం ఇళ్ల మధ్యలో నిల్వ ఉంటోంది. దీని గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఈ మిగిలిన సరుకును ఏడాది పొడవునా విక్రయిస్తుంటారు.

ఇళ్ల మధ్యలోనే నిల్వ

హిందూపురంలోని మోతుకపల్లికి వెళ్లే దారిలో ఓ వ్యాపారికి చెందిన బాణసంచా గోదాము ఉంది. దానికి 20 ఏళ్ల కిందట లైసెన్స్ మంజూరు చేశారు. అప్పట్లో ఆ గోడౌన్ సమీపంలో జనావాసాలు లేవు. ప్రస్తుతం దాని చుట్టూ ఇళ్లను నిర్మించుకున్నారు. ఇక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత..? ఐదేళ్ల కిందట హిందూపురం తహసీల్దారు ఆ వ్యాపారిని పిలిపించి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ఊరి బయట ఎక్కడైనా నిల్వ చేసుకోవాలని ఆదేశించారు. కానీ ఇప్పటికీ మార్పు జరగలేదు. పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఇంట్లో బాణసంచా నిల్వ ఉంచుకుని అమ్ముతున్నారు. మరో వ్యక్తి పట్టణంలోని ప్రధాన సర్కిల్‌లో, ఇళ్ల మధ్య చిన్న గోడౌన్ ఏర్పాటు చేసుకుని బాణ సంచా నిల్వ ఉంచారు. ఓ కళాశాలలో పనిచేసే ఉద్యోగి రైల్వే గేటుకింద అనధికారికంగా నిల్వ ఉంచారు. ముక్కడిపేట, హస్నాబాద్, పారిశ్రామికవాడలోని ఓ ప్రాంతంలో టపాసులు పెద్దఎత్తున నిల్వ ఉంచినట్లు సమాచారం. పండుగ దగ్గరపడేకొద్ది ధరలు పెరుగుతాయి. దీనివల్ల వ్యాపారులు దీపావళికి రెండు నెలలు ముందుగానే స్టాక్ తీసుకొచ్చి నిల్వ ఉంచుకుంటున్నట్లు సమాచారం.

చవితికి రూ.కోటి వ్యాపారం

వినాయక చవితి విగ్రహం ఏర్పాటు నుంచి నిమజ్జనం ముగిసేవరకు పురంలో రూ.లక్షలు విలువ చేసే టపాసులు పేల్చారు. ఇదంతా ఇక్కడే కొన్నదే. టపాసుల విక్రేతలే విగ్రహాల వద్దకు వెళ్లి మాట్లాడుకున్నారు. డిస్కౌంట్ ఇచ్చి మరీ అమ్మారు. ఈ ఏడాది నిమజ్జనం రోజే హిందూపురంలో రూ.కోటికి పైగా టపాసులు పేల్చారంటే అనధికారికంగా విక్రయాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ఊహించవచ్చు.

కఠిన చర్యలు తీసుకుంటాం..




వ్యాపారులు ఊరి బయట గోదాముల్లోనే టపాసులు నిల్వ ఉంచాలి. అక్కడ నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్యలో నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. లైసెన్స్ ఉన్నవారు పండుగకు మాత్రమే బాణసంచా విక్రయించుకోవాలి. ఏడాదిపాటు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తామంటే కుదరదు. అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించాలి.

-ప్రభాకర్, అగ్నిమాపకశాఖ అధికారి

మెరుగైన సేవలే లక్ష్యం

- దిశ సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- నిర్లక్ష్యపు సమాధానం చెబితే చర్యలు తప్పవ్: కలెక్టర్
- శిశువు మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: జడ్పీ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ కార్యాలయ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలోని సమావేశ భవనంలో గురువారం జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) నిర్వహించారు. ఎంపీతోపాటు కలెక్టర్ ఆనంద్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, దిశ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కొనకొండ్ల ఎంసీహెచ్‌లో పరిస్థితి దారుణంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందనీ, సమస్య ఎక్కడుందని డీఎంహెచ్ఓ ఈబీ దేవిని ప్రశ్నించారు. సిబ్బంది కొరత ఉందనీ, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామనీ, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆమె చెప్పారు. వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులకు బీమా అందించినట్లు తెలిపారు. సబ్సిడీ పప్పుశనగ పంపిణీకి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. జేడీ మాట్లాడుతూ.. 25 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించడానికి అంచనాలు తయారు చేసి, పంపామన్నారు. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని చెప్పుకొచ్చారు. అదును దాటిపోతోందనీ, వెంటనే పంపిణీ చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లాలో మొక్కజొన్న విస్తారంగా సాగు చేశారనీ, ప్రస్తుతం కోత దశలో ఉందనీ, ఇప్పుడు ధరలు తగ్గిపోతున్నాయనీ, ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేసి, రైతును ఆదుకోవాలని సభ దృష్టికి తెచ్చారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీ ఆదేశించారు. రైల్వే అండర్ బ్రిడ్జిల ప్రతిపాదనలు ఏమయ్యాయని ఎంపీ ప్రశ్నించారు. అన్నీ ఆమోద దశలో ఉన్నాయనీ, పరిశీలన కూడా పూర్తయిందని రైల్వే ఇంజనీర్ చెప్పారు. రహదారుల్లో, జిల్లా కేంద్రంలోని సర్వీస్ రోడ్లలో సైతం జాతీయ రహదారుల అధికారులు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎంపీ.. సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి అంచనాలు తయారు చేసి, సమస్య తలెత్తకుండా చూస్తామని సంబంధిత అధికారులు సమాధానమిచ్చారు.

నిర్లక్ష్యపు సమాధానం ఇస్తే చర్యలు

సమావేశంలో నిర్లక్ష్యపు సమాధానం ఇస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్.. విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణ సమయంలో ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కంబదూరు జడ్పీటీసీ సభ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన విద్యుత్ శాఖ ఎస్ఈ.. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రారంభంలోనే హద్దులు ఏర్పాటు చేస్తే అందుకు అనుగుణంగా స్తంభాలు ఏర్పాటు చేయడానికి తమకు ఇబ్బంది లేదన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు పూర్తి దశలో ఉన్నపుడు ఆర్‌అండ్‌బీ అధికారులు వచ్చి హద్దులు ఇస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆనంద్.. ఎస్ఈపై సీరియస్ అయ్యారు. 'ఆర్అండ్‌బీ ఎస్ఈ ఇక్కడే ఉంటారు కదా.. చర్చించుకుని, సమస్యను పరిష్కరించకుంటే ఎలా? మరొకరిపై నెపం వేయాలని ప్రయత్నిస్తే సహించేది లేదు. ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవ'ని హెచ్చరించారు.

శిశువు మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

శిశుగృహంలో శిశువు మృతి బాధాకరమని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సమావేశంలో ప్రస్తావించారు. బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. విచారణలో బాధ్యులను తేల్చి, విధుల నుంచి తొలగిస్తామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, డీపీఓ నాగరాజనాయుడు పాల్గొన్నారు.

తొందర్లోనే శుభవార్త వింటారు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ అవుతుంది

మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాలు, పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆర్డీటీకి సంబంధించి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ విషయంలో తొందర్లోనే శుభవార్త వింటారని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన గురువారం అనంతలో మీడియాతో మాట్లాడుతూ.. ఆర్డీటీకి సంబంధించి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇప్పటికే కేంద్రంతో రెండుసార్లు చర్చించారన్నారు. ఈ విషయాన్ని ఆయన వ్యక్తిగతంగా తీసుకున్నారన్నారు. తాజాగా జరిగిన సమావేశంలోనూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ అంశాన్ని ప్రత్యేకంగా మాట్లాడారన్నారు. తొందర్లోనే ఓ పాజిటివ్ వార్త వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. పేదలకు మంచి చేస్తున్న ఆర్డీటీ విషయంలో ప్రభుత్వం సానుకూలంగానే ఉందన్నారు. ముఖ్యమంత్రే ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ విషయంలో స్వయంగా మాట్లాడుతున్నారంటే ఆర్డీటీని కాపాడుకునే విషయంలో ముఖ్యమంత్రి చొరవ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చన్నారు.

యాడికిలో పేట్రేగిన దొంగలు

ఐదిళ్లలో చోరీ.. మరో రెండిళ్లలో యత్నం



వద్ది కృష్ణమూర్తి ఇంటిలో దొంగలు పగలగొట్టిన బీరువా

యాడికి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు ఐదిళ్లలో చోరీకి పాల్పడ్డారు. యాడికిలోని శాంతికాలనీకి చెందిన పోతురాయి శేఖర్ ఇంటికి తాళం వేసి పనుల నిమిత్తం వెళ్లాడు. బుధవారం రాత్రి దొంగలు పడి రూ.37వేల నగదు, తులం బంగారు చైన్, ఒక జత వెండిపట్టీలు చోరీ చేశారు. అదే కాలనీకి చెందిన గంధం సుమయాన్ ఇంటిలో రూ.10వేల నగదు, రెండుతులాల బంగారు చైన్, పది పట్టు చీరలు చోరీ చేశారు. గంగవరం శివ ఇంటి తాళాలు పగలగొట్టి రెండు జతల వెండిపట్టీలు, వెండి మొలతాడు చోరీచేశారు. చింతోటలో నివాసం ఉండే వద్ది కృష్ణమూర్తి ఇంటికి తాళాలు వేసి బెంగళూరు వెళ్లారు. బుధవారం రాత్రి దొంగలు పడి ఇంటిలోపల ఉన్న రెండు బీరువాలు పగలగొట్టారు. వస్తువులన్నింటిని విసిరేశారు. దేవుడి గదిలో ఉన్న వెండి వస్తువులు చోరీ చేశారు. కృష్ణమూర్తి బెంగళూరు నుంచి వస్తే గానీ ఇంటిలో ఏమి చోరీ జరిగిందో తెలియదు. కమ్మవీధికి చెందిన రాజగోపాల్‌నాయుడు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.4వేలు నగదు, వెండి వస్తువులు చోరీచేశారు. సమీపంలో తాళాలు వేసి ఉన్న మరో ఇంటిలో చోరీకి యత్నించారు. కుమ్మరవీధిలో ఓ ఇంటి తాళం పగలగొడుతుండగా గమనించిన ఒక మహిళ కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు.

క్లూస్‌టీంతో ఆధారాల సేకరణ

వరుస చోరీల సమాచారం అందుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. దొంగలు చోరీకి పాల్పడ్డ ప్రతి ఇంటికి తాళం వేసే భాగాన్ని కట్టర్‌తో కట్ చేయడం గమనార్హం.

పెద్ద ముఠా ఉందనే అనుమానం

ఒకేరోజు రాత్రి ఐదిళ్లలో చోరీ, మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నించడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఇది ఒకరిద్దరి పని కాదని వరుస చోరీల వెనుక పెద్ద ముఠానే ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తగు చర్యలు తీసుకొని చోరీలు జరగకుండా నివారించాలని కోరుతున్నారు.

టీచర్లకు బియ్యం కష్టాలు..!

పదో తేదీ వచ్చినా పాఠశాలలకు అందని రైస్

బదులు తెచ్చి పిల్లల కడుపునింపుతున్న ఉపాధ్యాయులు

తనకల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి బియ్యం సరఫరా కాకపోవడంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి కృషి చేస్తున్నా కొందరు ఉద్యోగుల ఉదాశీన వైఖరి, పర్యవేక్షణ లోపం వల్ల దానికి గండి పడుతోంది. విద్యాశాఖ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే సమస్యలు ఏర్పడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పదో తేదీ వచ్చినా బియ్యం సరఫరా కాకపోవడంతో ఉపాధ్యాయులు గ్రామాల్లో తమకు తెలిసిన వారి నుంచి బదులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న తాము గ్రామాల్లోకి వెళ్లి బియ్యం బదులు అడగడానికి ఇబ్బంది పడుతున్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ఉపాధ్యాయుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అన్ని గ్రామాల్లోని చౌకధాన్యపు డిపోలకు ప్రతి నెలా 30లోపు బియ్యం అందించే స్టాక్ పాయింట్ అధికారులు, పాఠశాలలకు మాత్రం ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు అందాల్సిన కోడిగుడ్లు కూడా ప్రతి నెలా సక్రమంగా సరఫరా చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు కోడిగుడ్లను బయట కొని, ఫొటోలు తీసి గ్రూపులలో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిసింది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యార్థులకు సక్రమంగా సన్న బియ్యాన్ని 30లోగా సరఫరా చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

● ఈ విషయాన్ని సీఎస్‌డీటీ వెంకటరెడ్డి దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకు వెళ్లగా ఆర్‌ఓలను స్టాక్ పాయింట్‌కు పంపడంలో ఆలస్యం కారణంగా ఇలా జరుగుతున్నట్లు తెలిపారు.

దంపతులను కలపడం మా పనికాదు: సీఐ

సోమందేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య విభేదాలు వస్తే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని, వారిని కలపడం తమపని కాదని సీఐ రాఘవన్ అన్నారు. వెలగమాకులపల్లి తండాకు చెందిన అశ్వర్థనాయక్ కుటుంబ సభ్యులు సీఐని గురువారం కలిసి తమ సమస్యను వివరించారు. డబ్బు, నగలు తీసుకుని తన భార్య ప్రమీళబాయి నెల క్రితం ఓ వేరే వ్యక్తితో వెళ్లిపోయిందని అశ్వర్థ నాయక్ వాపోయారు. ఫిర్యాదు చేసినా ఆమె ఆచూకీ కనిపెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులే దంపతులను కలపాలని అతని కుటుంబ సభ్యులు కోరారు. దీంతో సీఐ స్పందిస్తూ, గతంలో పలుమార్లు ఆమె భర్తను కాదని వెళ్లిపోయారని, తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి కలిపామని అన్నారు. ఆమెకు భర్తతో కలిసి ఉండటం ఇష్టంలేకపోతే తామేం చేయగలమని ప్రశ్నించారు. ఆమె జాడ తెలుసుకుని త్వరలో స్టేషన్‌కు తీసుకువస్తామని, భర్తతో కలిసి ఉండాలా లేదా అన్నది ఆమె వ్యక్తిగత విషయమని అన్నారు. గతంలో రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చామని, తనకు భర్తతో ఉండటం ఇష్టంలేదని ఆమె స్పష్టంగా చెప్పారని ఎస్ఐ రమేష్ అన్నారు. విడాకులు కావాలని ఆమె కోరారని అన్నారు. ఆమె ప్రస్తుతం డబ్బు, నగలతో వెళ్లినట్లు బాధితుడు తమ దృష్టికి తేలేదని అన్నారు.



సీఐకు సమస్యలు వివరిస్తున్న అశ్వత్థనాయక్, కుటుంబ సభ్యులు

పూటకో మాట..!

కొత్త టీచర్లతో విద్యాశాఖ ఆట

కౌన్సెలింగ్‌పై రోజూ గందరగోళం



కొర్రపాడు శిక్షణ కేంద్రంలో.. కౌన్సెలింగ్‌కు వచ్చిన కొత్త టీచర్లు

అనంతపురం విద్య, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త టీచర్లతో విద్యాశాఖ అధికారులు ఆడుకుంటున్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్ అని ఒకసారి, వెబ్ కౌన్సెలింగ్ అని మరోసారి చెబుతూ గందరగోళం సృష్టిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 748 మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిలో 167 మంది ఎస్‌జీటీలు, 581 మంది స్కూల్ అసిస్టెంట్‌లు ఉన్నారు. వీరికి విద్యాశాఖ స్థానాలను కేటాయించాల్సి ఉంది. నియామక ప్రక్రియలో ఏ చిన్న సమస్య వచ్చినా రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడాల్సి వచ్చింది. రాజధానికి తీసుకెళ్లి నియామక పత్రాలను ఇచ్చారు. పండుగ జరిగిన మరుసటి రోజు నుంచి రెసిడెన్సియల్ శిక్షణ పేరిట వారం రోజులు బందీలుగా మార్చారు. ఇపుడు స్థానాల కేటాయింపు కౌన్సెలింగ్ పేరిట పూటకో మాట చెబుతున్నారు. అందరికీ మాన్యువల్ కౌన్సెలింగ్ ఉంటుందని, ఏర్పాట్లు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులను తొలుత ఆదేశించారు. ఆ తర్వాత నాలుగురోజులకు అందరికీ వెబ్ కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. వెబ్ ఆప్షన్లు తీసుకుని స్థానాలు కేటాయిస్తామని అన్నారు. దీనిపై అభ్యర్థులకు అవగాహన కల్పించాలని బుధవారం రాత్రి జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. దీంతో శిక్షణా కేంద్రాలలో కొత్త టీచర్లకు అధికారులు, సిబ్బంది గురువారం ఉదయం అవగాహన కల్పించారు. కొత్త టీచర్లు వెబ్ ఆప్షన్లు కూడా ఇచ్చారు. ఆ తరువాత ఏం జరిగిందోగాని, మధ్యాహ్ననికి విద్యాశాఖ రాష్ట్ర అధికారులు వెబ్ ఆప్షన్‌లను మధ్యాహ్నం డిలీట్ చేశారు. స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే మధ్యాహ్నం నుంచి వెబ్ ఆప్షన్ల ద్వారా స్థానాలను కేటాయిస్తామని, ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి, స్థానాలు కేటాయిస్తామని ప్రకటించారు. దీంతో కొర్రపాడు సమీపంలోని ప్రాంతీయ శిక్షణా కేంద్రం వద్ద ఎస్‌జీటీలు రాత్రి వరకు పడిగాపులు కాశారు. డీఈఓ, ఏడీలు, సూపరింటెండెంట్‌లు, ఐటీ సెల్ సిబ్బంది అక్కడే ఉండిపోయారు. రాత్రి 9 గంటలు దాటినా రాష్ట్ర శాఖ నుంచి ఖాళీల జాబితా రాలేదు. కౌన్సెలింగ్ సర్వర్‌ను ఆన్ చేయలేదు. తొమ్మిదిన్నరకు సర్వర్ ఆన్ అయింది. అరకొర అవగాహనతో స్కూల్ అసిస్టెంట్లు వెబ్ ఆప్షన్‌లు ఇచ్చుకున్నారు. వీరికి శుక్రవారం స్థానాలు కేటాయిస్తూ ఉత్తర్వులు రానున్నాయి.

మా బంగారం మాకివ్వండి

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద బాధితుల ఆందోళన

తనఖా పెట్టిన బంగారం ఇవ్వాలని వాగ్వాదం

అనుచితంగా మాట్లాడిన ఏజెంట్

దాడి చేసిన బాధిత మహిళ

నాలుగో పట్టణ స్టేషన్‌కు పంచాయితీ



4వ పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

అనంతపురం క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తనఖా పెట్టిన తమ బంగారం తమకు ఇవ్వాలంటూ పలువురు బాధితులు రాంనగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద గురువారం ఆందోళనకు దిగారు. బ్యాంకు అధికారులతో వాదనకు దిగారు. ఇంతలో ఓ ఏజెంట్ అనుచితంగా మాట్లాడటంతో ఓ బాధిత మహిళ అతడి చెంప చెల్లుమనిపించింది. దీంతో వాగ్వాదం గొడవగా మారి, పంచాయితీ నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

కోర్టులో కేసు

రాంనగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు శాఖలో తనఖా పెట్టిన బంగారం విషయంలో గోల్‌మాల్ జరగడంతో కేసు నడుస్తోంది. ఇందులో బ్యాంకులోని కొందరు ఉద్యోగులతోపాటు, కీర్తన ఫైనాన్స్‌కు సంబంధించిన వ్యక్తుల ప్రమేయం ఉండటంతో కేసు విచారణ సాగుతోంది. బాధితుల్లో ఒకడైన రమేష్ గతంలో ఆ బ్యాంక్‌లో ఏజెంట్‌గా పనిచేసే జయరాం ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో తన బంగారాన్ని తనఖా పెట్టాడు. కొన్ని రోజుల తర్వాత సొమ్ము చెల్లించినా బంగారం మాత్రం బ్యాంకు వారు ఇవ్వలేదు. దీనికి జయరామే బాధ్యుడని బాధితుడు రమేష్ భావించాడు. కాగా తనఖా బంగారం గోల్‌మాల్ విషయంలో జయరాంపై ఇది వరకే ఆరోపణలు, కేసులు నమోదు కావడంతో రిమాండ్‌కు కూడా వెళ్లి వచ్చాడు. అయితే గురువారం ఉదయం బాధితుడైన రమేష్‌కు జయరాం కనిపించడంతో అతడిని నిలదీయడానికి బంధువులతో కలిసి బ్యాంకు వద్దకు వెళ్లాడు. వీరికి మరింతమంది బాధితులు తోడయ్యారు. బాధితులు సుమారు 10 మంది వరకూ జయరాంతోపాటు, బ్యాంకు వాళ్లను గట్టిగా నిలదీశారు. ఈ క్రమంలో జయరాం, బ్యాంకు సిబ్బంది, బాధితులకు వాగ్వాదం జరిగింది. బంగారం గోల్‌మాల్ కేసు కోర్టులో నడుస్తోందని, మీరు కూడా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంట్ ఇవ్వాలంటూ బాధితులకు బ్యాంకు సిబ్బంది సూచించారు. అయితే 'తాము మీ దగ్గర బంగారం పెట్టాం. మీరే తెచ్చి ఇవ్వాలి' అంటూ గట్టిగా నిలదీస్తున్న బాధితులకు జయరాం అడ్డుతగిలాడు. 'మీ బంగారం ఎలా బయటకొస్తుందో చూస్తాం' అంటూ అనుచితంగా మాట్లాడంతో బాధితుల్లోని ఓ మహిళా అతడి చెంపపై కొట్టింది. ఆవేశంలో ఉన్న ఆమె మరింతగా దాడి చేసింది. దీంతో బ్యాంకు సిబ్బంది 4వ పట్టణ పోలీసులను సమాచారం ఇచ్చారు. వాళ్లు అక్కడకు చేరుకుని బాధితులు, బ్యాంకు సిబ్బందిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేస్తున్నారు. బాధితుల్లో రమేష్ ఐదున్నర తులాలు, సాయికిరణ్ తొమ్మిదిన్నర తులాలు, మహేష్ 9.8 తులాలు, లోక్‌నాథ్, ఆయన సోదరులు 49 తులాలు, రవిచంద్ర మరో 9 తులాలు తనఖా పెట్టామని వాపోయారు. కొందరికి తనఖా పెట్టినప్పుడు ఇచ్చిన రిసిప్టులు కూడా నకిలీవని బ్యాంకు అధికారులు చెబుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు న్యాయం చేయాలని వారు కోరారు.

ఎస్‌బీఐ వద్ద ఖాతాదారుల ఆందోళన



పురంలో బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఖాతాదారులు

హిందూపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో కుదువపెట్టిన బంగారాన్ని తమకు వెంటనే ఇవ్వాలని, లేదంటే దాని విలువ చెల్లించాలని ఎస్‌బీఐ వద్ద ఖాతాదారులు గురువారం ఆందోళన చేశారు. తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్‌బీఐలో కొన్ని నెలల క్రితం దోపిడీ జరిగిన విషయం తెలిసిందే. ఖాతాదారులు కుదువపెట్టిన బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. వివాహాల కోసం కొనుగోలు చేసిన బంగారాన్ని కుదువపెట్టామని, విడిపించుకుందామంటే బ్యాంకు అధికారులు మూడు నెలలుగా తిప్పుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పది గ్రాములకు ఒక గ్రాము తీసేస్తామని, పది గ్రాములకు రూ.లక్ష మాత్రమే చెల్లిస్తామని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తులం బంగారం రూ.1.30 లక్షలు ఉందని, ఈ రోజున్న ధరతోనే చెల్లించాలన్నారు. చోరీ జరిగి మూడు నెలలు అవుతోందని, ఈ మూడు నెలలకు వడ్డీ చెల్లించాలని బ్యాంకు అధికారులు డిమాండ్ చేయడం బాధాకరమని అన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని బ్యాంకు మేనేజరు వారికి హామీ ఇచ్చారు.





సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

ఆడ, మగ తేడా వద్దు

● స్త్రీ, పురుష సమానత్వంతో సమాజాభివృద్ధి

● సినీ దర్శకుడు ఉమామహేశ్వరరావు

● అనంతలో మొదలైన ఐద్వా సాంస్కృతికోత్సవాలు



ప్రసంగిస్తున్న సినీ దర్శకుడు ఉమా మహేశ్వరరావు

అనంతపురం టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్త్రీ పురుషులకు సమాన హక్కులు కల్పించినపుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని సినీ దర్శకుడు ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను పురస్కరించుకుని గురువారం సాయంత్రం స్థానిక కృష్ణకళామందిర్‌లో సాంస్కృతికోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు సరళ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలో ఆడ, మగ అన్న తేడా లేకుండా పిల్లలను సమానంగా పెంచి, సమాన హక్కులు కల్పించాలన్నారు. డీఆర్‌ఓ మలోల మాట్లాడుతూ సమాజానికి మహిళా సాధికారత ఎంతో అవసరమన్నారు. ఐద్వా వంటి సంఘాలు మహిళల హక్కులకోసం పోరాడుతూ చైతన్యం కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. డాక్టర్ అరుణ మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఎంతో ఆలోచింపజేసేలా ఉందన్నారు. ఎల్‌కేపీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది పద్మజ మాట్లాడుతూ సమాజంలో మహిళల పక్షాన ఐద్వా చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ ఐద్వా రాష్ట్ర మహాసభలు ఈనెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలోనే ఆరంభ సూచికగా సాంస్కృతికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గేట్స్ కళాశాల అధినేత్రి పద్మావతి, డాక్టర్ ప్రసూన, ప్రగతి, యూటీఎఫ్ నాయకురాళ్లు దేవేంద్రమ్మ, ప్రమీల, రాష్ట్ర నాయకుడు రమణయ్య, ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, క్రిష్ణమూర్తి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసం మార్పులు

అహుడా చైర్మన్ టీసీ వరుణ్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పారదర్శకతే ప్రామాణికంగా అహుడాలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టినట్లు చైర్మన్ టీసీ వరుణ్ పేర్కొన్నారు. అహుడా కార్యాలయంలో గురువారం ఆయన జేసీ శివ నారాయణ శర్మతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రత్యేక వెబ్‌సైట్ లో అహుడా కార్యక్రమాలను పొందుపరచాలని ఆదేశించారు. అహుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే లేఅవుట్‌లలో ప్లాట్ల విక్రయానికి ఈ-ఆక్షన్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ ఎంఐజీ లేఅవుట్లతోపాటు నూతనంగా అహుడా ఆధ్వర్యంలో కదిరి, కళ్యాణదుర్గం, గుమ్మఘట్ట, రాచానపల్లి తదితర ప్రాంతాలలో మరిన్ని లేఅవుట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు అనుమతులు పొందని ప్రైవేటు లేఅవుట్ల యజమానులు అక్టోబరు 23లోపు అనుమతులు తీసుకోవచ్చన్నారు. ఇకపై ప్రతి గురువారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అహుడా ప్లానింగ్ ఆఫీసర్ మహ్మద్ ఇషాక్, ఈఈ దుశ్యంత్, సెక్రటరీ రామకృష్ణారెడ్డి, డీఈ రేవంత్, జేపీఓ హరీష్‌చౌదరి, సర్వేయర్ శరత్‌బాబు, డీఏఈ జ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీసీ వరుణ్

రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 20వతేదీ నుంచి ఎలెక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి గురువారం ప్రకటనలో తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయసు కలిగి, రేషన్, ఆధార్‌కార్డు కలిగిన ఉమ్మడి జిల్లా నిరుద్యోగ పురుషులు అర్హులన్నారు. 30రోజుల శిక్షణా సమయంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ సంస్థ కార్యాలయలో నేరుగాగానీ, 9492583484 నంబరులోగానీ సంప్రదించాలని కోరారు.

దోహాలో హోం కేర్ నర్స్ ఉద్యోగాలు

అనంతపురం విద్య, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఖతార్‌లోని దోహాలో మైనార్టీలకు హోం కేర్ నర్స్ ఉద్యోగావకాశాలు ఉన్నాయని మైనార్టీ కార్పొరేషన్ అధికారి జగన్‌మోహన్‌రావు గురువారం ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 40 ఏళ్ల వయసు, బీఎస్సీ నర్సింగ్ చేసి, కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి, అర్హతగలవారు ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తును జిల్లా కార్యాలయంలో అందజేయాలని ఆయన తెలిపారు.

గుంతకల్లు డివిజన్‌కు అవార్డు

గుంతకల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు పంక్చువాలిటీ అవార్డు లభించింది. రైళ్లను సకాలంలో నడిపే విషయంగా రైల్వే శాఖ డివిజన్లకు అతి విశిష్ట రైల్ పురస్కార్ అవార్డుల్లో భాగంగా గ్రేడింగ్ ఇస్తుంది. ఇందులో గుంతకల్లు డివిజన్‌కు వంద శాతం పంక్చువాలిటీ అవార్డు లభించింది. గుంతకల్లు డివిజన్‌కు ఈ అవార్డు లభించడం ఇది 11వసారి కావడం గమనార్హం.

క్రిమిసంహారక మందుల సరఫరాకు టెండర్లు

జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి విజయ్‌కుమార్

అనంతపురం అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టురైతులకు నాణ్యమైన క్రిమిసంహారక మందుల సరఫరాకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి విజయ్‌కుమార్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. శిల్క్ సమగ్ర-2 గ్రాంట్ ద్వారా క్రిమిసంహారక మందులు సరఫరా చేసేందుకు ఈనెల 25వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు డీలర్లు టెండర్ ఫాంలు దాఖలు చేయాలన్నారు. ఈనెల 29న ఉదయం 11.30 గంటలకు కలెక్టరేట్‌లో టెండర్ బాక్సును తెరుస్తామన్నారు. టెండర్‌దారులు ఈఎండీ మొత్తం రూ.62500 డీడీ రూపంలో డీఎస్‌ఓ, అనంతపురం పేరుపై చెల్లించి, టెండర్ ఫాంతోపాటు జత చేయాలన్నారు. వివరాలకు 8639500606 నంబరులో సంప్రదించాలని కోరారు.

రాయల వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

చరిత్రకారుడు మైనాస్వామి విజ్ఞప్తి



అజయ్ జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న మైనాస్వామి

గోరంట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయల వర్ధంతిని ఈ నెల 17న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని చరిత్రకారుడు మైనాస్వామి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌ను విజయవాడలో కలిసి వినతి పత్రం సమర్పించారు. కర్ణాటకలోని తుమకూరు జిల్లా హోనేహళ్లిలో లభించిన శాసనం ప్రకారం శ్రీకృష్ణ దేవరాయలు 1529 అక్టోబరు 17న మరణించారని చరిత్రకారుడు నరసింహన్ పేర్కొన్న విషయాన్ని లేఖలో పొందుపరిచి ఆయనకు అందించారు. సానుకూలంగా స్పందించిన అజయ్ జైన్, 17న రాయలవారి వర్ధంతిని నిర్వహించాలని సాంస్కృతిక శాఖ సంచాలకులకు లేఖను పంపించారని మైనాస్వామి తెలిపారు. ఫిబ్రవరి 16న రాయలవారి జయంతి, ఆగస్టు 7న పట్టాభిషేక ఉత్సవం తదితర కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ క్యాలెండర్‌లో పొందుపరచాలని విజ్ఞప్తి చేశారు.

ప్రక్షాళన దిశగా...!

● ఐసీడీఎస్ పీడీగా అరుణ కుమారి

● నలుగురు సీడీపీఓలకు షోకాజ్ నోటీసుల

● గుత్తి సూపర్‌వైజర్‌పై సస్పెన్షన్ వేటు



నూతన ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి

అనంతపురం వైద్యం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మాతా, శిశు సంక్షేమ శాఖ ప్రక్షాళన దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. ఐసీడీఎస్ పీడీగా జిల్లా సహకార శాఖ అధికారి అరుణ కుమారికి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ కలెక్టర్ ఆనంద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శిశు గృహలో శిశువు మరణం సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని, పీడీ ఎం.నాగమణిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో సీనియర్ సీడీపీఓలలో ఒకరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారని భావించారు. కానీ కలెక్టర్ భిన్నమైన నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు నాలుగు ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించినట్లు ప్రభుత్వం గుర్తించింది. గుత్తి సీడీపీఓ ఎం.భారతి , ఉరవకొండ సీడీపీఓ బీఎస్ శ్రీదేవి, కణేకల్లు సీడీపీఓ ఎ.నాగమణి, కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీప్రసన్నకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. గుత్తి ప్రాజెక్టు పరిధిలో సూపర్‌వైజర్ లక్ష్మీనరసమ్మను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

సమగ్ర దర్యాప్తు

శిశుగృహలో రెండు నెలల శిశువు మృతి, తదుపరి పరిణామాలపై ప్రభుత్వం అంతర్గతంగా కూపీ లాగుతోంది. శిశువు మరణించిన తరువాత ఖననం చేసేందుకు నిబంధనలు పాటించాలి. ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, కలెక్టర్ నుంచి అనుమతి పొందాలి. కానీ అధికారులు, సిబ్బంది గుట్టుగా ఖననం చేశారు. తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేలా వ్యవహరించారని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు జరుగుతోంది.

న్యూస్ బాక్స్

ప్రైవేటు పాఠశాలల తనిఖీ



ప్రైవేటు పాఠశాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈఓ రెడ్డెప్ప

గాండ్లపెంట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదుతో డిప్యూటీ డీఈఓ రెడ్డెప్ప గురువారం తనిఖీలు చేపట్టారు. ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు జీసీఆర్, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులతో పెనుకొండ డిప్యూటీ డీఈఓ ఆరా తీశారు. పాఠశాలలో ఫీజులు వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలో తరగ తుల వారిగా ఫీజు వసూలుపై ఉన్నత అధికారులకు పంపిస్తామని తెలిపారు. తనిఖీల్లో ఎంఈఓ కృష్ణ నాయక్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో డ్రైనేజీ కాలువల నిర్మాణం

ధర్మవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేశవనగర్‌లో రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీల పనులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టణంలో ప్రతివార్డులలో డ్రైనేజీ సమస్యలను తొలగించడానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ శ్రద్ధ చూపుతున్నారని అన్నారు.

సీజేఐపై దాడి యత్నం దారుణం

కదిరిఅర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం రాజ్యాంగంపై జరిగిన దాడిగానే పరిగణించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం సమాఖ్య కార్యాయలంలో ఆయన విలేకరరులతో మాట్లాడారు. దేవాలయం వంటి కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. సనాతన ధర్మం పేరుతో ఎవరిపైపడితే వారిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

బయటి వ్యక్తులతో బంగారం కొనొద్దు: సీఐ

కొత్తచెరువు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తుల వద్ద బంగారు షాపు యజమానులు బంగారం కొనుగోలు చేయరాదని సీఐ మారుతీశంకర్ తెలిపారు. గురువారం బంగారు దుకాణల యజమానులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాల్లో వచ్చి బంగారు ఆభరణాలను దోచుకెళ్తున్నారని అన్నారు. కొందరు బంగారు తక్కువ ధరకు ఇస్తామని నమ్మబలుకుతూ మోసం చేస్తున్నారని అన్నారు. తక్కువ ధరకు బంగారు ఇస్తామని వస్తే సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

కంపచెట్ల తొలగింపు



కంపచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

తనకల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగ్లిపల్లి నుంచి చీకటిమానిపల్లి వరకు వరుసగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు వ్యాపించడంతో గురువారం ఎస్ఐ గోపి తన సొంత నిధులతో రోడ్డుకి ఇరువైపులా కంపల తొలగించే కార్యక్రమం చేపట్టారు. జాతీయ రహదారి అధికారులు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించకపోవడంతో తరచుగా ప్రమాదాలు సంభవించి మరణాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎస్ఐ వివిధ కార్యక్రమాలను చేపట్టారు. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపులా కంపలు తొలగించడం, గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించడం, ప్రజలలో చైతన్యం తీసుకురావడంతో పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ

ధర్మవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఓట్ చోర్ గద్దిచోడ్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తుంపర్తి పరమేశ్ ఆధ్వర్యంలో గురువారం కాలేజ్ సర్కిల్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కేంద్రప్రభుత్వం లక్షలాది అక్రమ ఓట్ల చేర్పు ప్రక్రియ దిగ్విజయంగా నడిపిస్తోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగేతర శక్తిగా అవతరిస్తోందని, ప్రజల హక్కులను కాలరాసేవిధంగా పరిపాలన సాగిస్తోందని అన్నారు. ప్రజలకు అండగా రాహుల్‌గాంధీ నిలిచి రాజ్యాంగాన్ని కాపాడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

రెండు రోజులు తాగునీటి సరఫరా బంద్

కదిరి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో రెండురోజులు తాగునీటి సరఫరా ఉండదని కదిరి ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఆరీఫ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల శుక్ర, శనివారాల్లో తాగునీటి సరఫరా ఉండదన్నారు. దొరిగిల్లు పంప్‌హౌస్ వద్ద పైపుఉ పనిచేయలేదన్నారు. వాటిని మరమ్మతులు చేయడానికి రెండు రో జులు పడుతుందని తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

పంట నమోదును పరిశీలించిన ఆర్డీఓ

బత్తలపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం బత్తలపల్లి సమీపంలో గురువారం పంట నమోదు కార్యక్రమాన్ని ఆర్డీఓ మహేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా గంటాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పొలం సర్వే నెంబర్ 577-12లో వేరుశనగ పంట సాగును పరిశీలించారు. అనంతరం మండలంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఏడీ లక్ష్మేనాయక్, ఏఓ ఓబిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు ప్రారంభం

బత్తలపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓబుళాపురంలో గురువారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఏఎస్ఓ శర్మ ఆధ్వర్యంలో గ్రామంలోని ఆదినారాయణకు చెందిన పొలంలో రైతుల సమక్షంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. 3.340 కిలోల దిగుబడి వచ్చినట్లు ఏఎస్ఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓ శ్రీనివాసులు, వీపీఏ నాగార్జున పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వేలంపై నిర్లక్ష్యం

● ఆదాయం కోల్పోతున్న పంచాయతీ
● పట్టించుకోని అధికారులు

ముదిగుబ్బ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం వల్ల ముదిగుబ్బ మేజర్ పంచాయతీ రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతోంది. ముదిగుబ్బలోని పంచాయతీ దుకాణ సముదాయంలోని గదుల వేలంపాట నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వేలం ఎప్పుడు నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ముదిగుబ్బ పంచాయతీ కార్యాలయం వద్ద ఐదు దుకాణ గదులను నిర్మించారు. వాటిని పంచాయతీ అధికారులు ప్రతి రెండేళ్లకు ఒకసారి వేలంపాట నిర్వహించి అద్దెకు ఇస్తున్నారు. 2023లో వేలం నిర్వహించి ఒక్కో గది నెలకు రూ.8వేలు చొప్పున అద్దెకు ఇచ్చారు. ఈ ఏడాది మార్చితో వేలం గడువు ముగిసింది. ఆ నెలలో వేలం నిర్వహించాల్సి ఉన్నా ఇప్పటి వరకు అధికారులు నిర్వహించలేదు. దీంతో ఐదు దుకాణ గదులు ఖాళీగా ఉన్నాయి. వాటి నుంచి అద్దెల రూపంలో వచ్చే ఆదాయం నెలకు రూ.40 వేలు పంచాయతీ కోల్పోతోంది. 8 నెలలుగా వేలంపాట నిర్వహించకపోవడంతో పంచాయతీ ఆదాయం కోల్పోతోంది. వేలంపాట నిర్వహించడం ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయలో వివిధ పనులు చేపట్టేందుకు ఎంతో వెసులుబాటు ఉండేది. ఇప్పటి వరకు అద్దెకు ఇవ్వకపోవడంతో గదులు నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చాలని స్థానికులు కోరుతున్నారు.



వేలంపాట నిర్వహించాల్సిన పంచాయతీ గదులు

గదుల వేలం నిర్వహిస్తాం

గదులకు మరమ్మతులు చేయించాం. ఉన్నత స్థాయి అధికారులకు నివేదికలు పంపించాం. వారి ఆదేశాల అందిన వెంటనే పంచాయతీ గదులను వేలం నిర్వహిస్తాం. **-మంజుల, పంచాయతీ కార్యదర్శి**

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ధర్మవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోతుకుంలో ఐసీడీఎస్, విద్యాశాఖ అధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పోతుకుంట జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

● పుట్టపర్తిరూరల్ : అమ్మాయిల చదువు అవనికి వెలుగు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయంతి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ బాలికా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. గణేష్ కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: విద్యలో బాలికలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నరసమ్మ, ప్రధానోపాధ్యాయుడు మోహనరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● తనకల్లు : లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. తనకల్లులో వివిధ శాఖలు అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ రామానాయక్, ఏపీఎం జయంతి, ఈఓఆర్డీ, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్మవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు

సంస్కృతి పరిరక్షణే ధ్యేయం: ఆర్‌ఎస్‌ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌కుమార్ రెడ్డి

అమడగూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సంస్కృతిని పరిరక్షించడమే ఆర్ఎస్ఎస్ ధ్యేయమని బీజేపీ ఆర్గానిక్ సెల్ రాష్ట్ర కన్వీనర్ చింతా శరత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని జేకే పల్లి సాయిబాబా గుడిలో ఆర్ఎస్ఎస్ సభ్యులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘ స్థాపన నుంచి నేటి వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ నిర్మాణం, సంస్కృతి పరరక్షణ, సేవాభావం ముఖ్య లక్షణాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయస్వామి, చంద్రవాసు, హరీష్ కుమార్, కృష్ణమూర్తి, వనజమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విజయ్‌కుమార్

కొత్తచెరువు, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టిసారించాలన్నారు. మద్యం, డ్రగ్స్ లాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మారుతీ శంకర్, నాయకులు వలిపి శీనా, చలం, మణి, తులసి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు: ఆర్డీఓ

బత్తలపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మవరం ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. మండల పరిధిలో పోలీసు, రెవిన్యూ అధికారులతో కలిసి ఆర్డీఓ ఇసుక అక్రమ రవాణాపై దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ముదిగుబ్బ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సీపీఐ నాయకులు పరిశీలించారు. వసతులు, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో ఆసుపత్రిలోని సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ప్రస్తుత వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సత్యకుమార్ యాదవ్ ముదిగుబ్బ ప్రాథమిక కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఆసుపత్రిలో కనీస మౌలిక వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఏ చిన్న రోగమొచ్చిన పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాధాకృష్ణ, చిన్నప్ప, నాయుడు, ప్రభాకర్, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవను అలవరచుకోవాలి



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సామాజిక సేవలను అలవరచుకోవాలని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరెడి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో 1997-2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం ప్రస్తుత విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు షమీవుల్లా, గోపాల్‌నాయక్, పావని, భువనేశ్వరి, హైమావతి, మీనా, ధనుంజయ, పూర్వ విద్యార్థులు నాగభూషణం, కుళ్లాయప్ప, చిన్నవెంకటేశులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ లబ్ధి

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్
సదస్సులో డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రతి కుటుంబానిక లబ్ధి చేకూరుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణల వల్ల మందుల ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కల్యాణ్‌చక్రవర్తి, వైద్యులు గాయత్రిబాయి, భవ్యయాదవ్, శివరాం, ఎంహెచ్ఎస్ చంద్రకళ, కౌన్సిలర్ వెంకటరమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



పుట్టపర్తిలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం

● ధర్మవరం: పట్టణంలో ప్రతి దుకాణం వద్ద కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలను నోటీసు బోర్డులో ఉంచాలని ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం, జిల్లా అంధత్వ నివారణ అధికారి అనూరాధ, డిప్యూటీ డీఎంహెచ్ఓ చెన్నారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, కంటి వైద్యనిపుణులు నరసింహులు పాల్గొన్నారు. పుట్టపర్తి అసిస్టెంట్ కమిషనర్ మెరువ చందు, డిప్యూటి అసిస్టెంట్ కమిషనర్ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌పీ సర్కిల్‌లోని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● గాండ్లపెంట: మండల కేంద్రలోని పంచాయతీ రాజ్ కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ బాబురావు, ఇన్‌చార్జ్ కార్యదర్శులు పలువురు పాల్గొన్నారు.

● ఓబులదేవరచెరువు: మండల కేంద్రంలోని సచివాలయంలో జీఎస్టీ తగ్గింపుపై మెడికల్ షాప్ యజమానులు, ఆర్ఎంపీలు, సచివాలయ, ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకు ముందు సచివాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటి ఎంపీడీఓ అంజనప్ప, గ్రామ కార్యదర్శి శంకరప్ప, హెల్త్ సూపర్‌వైజర్‌లు మురళి, సచివాలయ సిబ్బంది హరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● నల్లమాడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు బాబ్‌జాన్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మందులు, వైద్య పరికరాలపైన జీఎస్టీ తగ్గించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. గ్రామాల్లో కూడా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ సభ్యులు, బుట్టి నాగభూషణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొలుసు పురుగుపై జాగ్రత్త వహించాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి

తాడిమర్రి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చీనీ పంటలో పొలుసు పురుగు వ్యాప్తి చెందకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తిరుపతి వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి తెలిపారు. జిల్లా హార్టికల్చర్ అధికారి చంద్రశేఖర్‌తో కలిసి తాడిమర్రిలోని రైతు సేవాకేంద్రంలో గురువారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఉద్యానవన అధికారి అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని ఆసుపత్రులపై చర్యలు: డీఎంహెచ్ఓ

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా గురువారం గోరంట్ల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో ఉన్న పార్థ ఆసుపత్రిని తనిఖీ చేశామని తెలిపారు. నిబంధనల ప్రకారం ఆసుపత్రిని ఏర్పాటు చేసినప్పటికి.. జిల్లా ఉన్నతాధికారులు తనిఖీలకు వెళ్లినపుడు సంబంధిత డాక్టర్ లేకపోవడం.. ఒక డాక్టర్ పేరుతో అనుమతి పొంది అనేక మంది స్పెషల్ డాక్టర్ల పేర్లను బోర్డులో ప్రదర్శించడం చట్ట విరుద్ధం అన్నారు. స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్యవిద్య వివరాలు, వారి నుంచి అనుమతులున్నాయా ప్రశ్నించగా.. ఆసుపత్రి యాజమాన్యం నుంచి సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. నిబంధనలను ఉల్లంఘించి ఆసుపత్రిని నిర్వహిస్తుండడంతో మూసివేయించినట్లు డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. గతంలో అనేక మంది ఈ ఆసుపత్రిపై ఫిర్యాదులు చేసినట్లు తమ విచారణలో తేలిందని వెల్లడించారు.

విద్యార్థులకు సృజనాత్మకత అవసరం



ఆర్ట్, క్రాఫ్ట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కదిరి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సృజనాత్మకత అవసరమని సాధన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాధిక్ బాషా పేర్కొన్నారు. గురువారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వర్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరించిపోతున్న కళ, సంస్కృతికి తమ విద్యార్థులు జీవం పోస్తున్నారని తెలిపారు. పర్యావరణానికి నష్టం కలిగించని, పునర్వినియోగం చేయగల, సహజసిద్ధమైన పదార్థాలతో గొప్ప ఆకృతులను, కళా ఖండాలు రూపొందించారని కొనియాడారు. గత విద్యా సంవత్సరంలో కూడా ఫుడ్ ఫెస్టివల్, క్విజ్, ఫ్రూట్ ఫెస్టివల్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ షాహిదా, కరస్పాండెంట్ గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న పీవీఎస్ పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు

ముదిగుబ్బ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీవీఎస్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ముఖేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో బుధవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 హ్యాండ్‌బాల్ పోటీల్లో ముఖేష్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పీవీఎస్ పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ముఖేష్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ జ్యోతి యాదవ్, ప్రిన్సిపాల్ మనీషా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..



పోటీలకు ఎంపికైన పవన్, నవ్య

ధర్మవరంరూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామాపురం వద్ద ఆర్డీటీ క్రీడామైదానంలో వివేకానంద స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో కబడ్డీలో శిక్షణపొందుతున్న ఇద్దరు క్రీడాకారులు పవన్, నవ్య అండర్ 19రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కబడ్డీ కోచ్ పృథ్వీ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 8న అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఆర్డీటీ హనుమంతప్ప, ఏటీఎల్ శ్రీనివాసులు, కోచ్‌లు, క్రీడాకారులు అభినందించారు.

మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుదాం



అవగాహన కల్పిస్తున్న భాస్కర్

కొత్తచెరువు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటి ప్రకృతి కాపాడాలని పర్యావరణ వేత్త భాస్కర్ తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిలో మార్పుల వల్ల అతివృష్టి, అనావృష్టి సంభవిస్తున్నాయని అన్నారు. దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అడవి జంతువులు అవాసాలు కోల్పోతుండడంతో గ్రామాల్లోకి వసున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపాల్ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా

ధర్మవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిషి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర షూటింగ్‌బాల్ పోటీల్లో సత్తాచాటినట్లు పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గత నెల 25,26 తేదీలలో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ఎస్‌వీ సిరి, వై.శాలిని, పి.షణ్ముక సత్తాచాటినట్లు తెలిపారు. గురువారం విద్యార్థులను ప్రిన్సిపాల్ కరుణ్‌స్వరూప్‌సింగ్, సీఈఓ రవీంద్ర విద్యార్థులను అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న డీన్ భాస్కర్‌రెడ్డి

రైతులకు న్యాయం చేస్తాం: టీడీపీ నాయకులు


మలుగూరులో రైతులతో మాట్లాడుతున్న నాయకులు

హిందూపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం మలుగూరు, చలివెందుల వద్ద పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు ఇవ్వనున్న రైతులకు న్యాయంచేస్తామని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం హిందూపురం మండలం మలుగూరులో భూములు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్యం లేని పరిశ్రమలు మాత్రమే ఏర్పాటు చేస్తారన్నారు. ఇంటిలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా చూస్తామన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు పరిశ్రమల రాకను జీర్ణించుకోలేక అడ్డుపడేందుకు రైతులను రెచ్చగొడుతున్నారని, వారిమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. భూములు ఇస్తున్న రైతులకు సంబంధించి మంచి ధర ఇప్పించే విధంగా నందమూరి బాలకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడతారన్నారు. పొలాల్లో బోరుబావులు, చెట్లు ఉంటే వాటికి కూడా నష్టపరిహారం ఇస్తారన్నారు. అవసరమైతే మరోసారి బోరుబావులు, చెట్లకోసం సర్వేచేపిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, మండల కన్వీనర్ హెచ్‌ఎన్‌రాము, సింగిల్‌విండో అధ్యక్షులు శంకర్, సర్పంచ్ మంజునాథ్, మాజీ సర్పంచ్ రషీద్, ఐటీడీపీ రామాంజి, రామక్రిష్ణ, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణను ఆపండి: వైసీపీ

హిందూపురం(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలో మలుగూరు, చలివెందుల వద్ద ప్రభుత్వం సేకరిస్తున్న భూములను ఆపాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక అన్నారు. గురువారం రైతులతో కలిసి వైసీపీ నాయకులు ఆర్‌అండ్‌బి అతిథిగృహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసేకరణ ఆపాలన్నారు. లేదంటే వైసీపీ ఆధ్వర్యంలో నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర మహిళావిభాగం కార్యదర్శి చౌళూరుమధుమతిరెడ్డి పాల్గొన్నారు.

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు

శాస్త్రవేత్త డాక్టర్ మురళి

మడకశిర రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అనంతపురం ప్రాంతీయ పట్టు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మురళి, పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుర్రపుకొండ గ్రామంలో మల్బరీ రైతులకు పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో పట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెళకువలు, పట్టుగుడ్డు పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సిరికల్చర్ ఏడీఏ హనుమంతనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి సీజ్

గోరంట్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలో ఏర్పాటు చేసిన పార్థ ఆస్పత్రిని కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఫైరోజ్ బేగం గురువారం సీజ్ చేశారు. జిల్లా అధికారులు తనిఖీకి వెళ్లిన సమయంలో స్పెషలిస్టు డాక్టర్లకు సంబంధించి వివరాలు అడిగారు. అయితే ఆసుపత్రి యాజమాన్యం నుంచి సమాధానం రాకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

రక్షణ కల్పించండి: ఎయిర్ బస్ డ్రైవర్లు

హిందూపురం, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): తమకు రక్షణ కల్పించాలని ఎయిర్ బస్ డ్రైవర్లు కోరారు. కొంత మంది ప్రయాణీకులు తమపై దాడి చేస్తున్నారని, అయినా యాజమాన్యం తమకు అండగా ఉండటంలేదన్నారు. ఇలాగైతే మేం ఉద్యోగాలు చేయమని భీష్మించారు. బస్సులు ఆపేసి ఆర్టీసి డిపోవద్ద నిరసన తెలిపారు. ఇప్పటికైనా రక్షణ కల్పించాలని కోరారు. డిమాండ్లను పరిష్కరిస్తేనే బస్సులు నడుపుతామన్నారు.

బాలల పోషణపై దృష్టి పెట్టండి: సీడీపీఓ


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీడీపీఓ, మహిళలు

పావగడ, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): బాలల పోషణపై దృష్టిపెట్టాలని అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీఓ సునీత సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహార కేంద్రాలుగా కాకుండా వారి ప్రతిభ అనుగుణంగా ప్రోత్సహించి వారి భవిష్యత్తు కేంద్రాలుగా మార్చాలన్నారు. గురువారం గురుభవనంలో నిర్వహించిన అభివృద్ధిశాఖ ఇంటిగ్రేట్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీం ద్వారా నిర్వహించిన పోషణ్ బీ.. పడాయిబీ పథకం కింద మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కేంద్రాలకు పిల్లలకు పోషకాహారం అందజేయాలన్నారు. నాణ్యమైన విద్యకు ప్రాథమిక కారకులుగా అంగన్‌వాడీ టీచర్లు కావాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలక్ష్మి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, మమత, నాగలక్ష్మి, మంజుళ తదితరులు పాల్గొన్నారు.

మరణశిక్ష విధించాలి: దళిత సంఘాలు

పావగడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌కు మరణశిక్ష విధించాలని తాలూకా దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు తిప్పేస్వామి, పెద్దన్న, మంజునాథ్, వెంకటరమణ, నాగరాజు, రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి: ఏపీఓ

గుడిబండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్‌కార్డులు పొందిన కూలీలు ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీఓ జగదీశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకుంటేనే ఉపాధి పనులు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. త్వరగా ఈకేవైసీ చేయించుకుని ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సూచించారు.

'బాలికల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'

హిందూపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాలికల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. గురువారం హిందూపురంలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రహమత్‌పురం సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ బేటీబచావ్, బేటీ పడావ్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. బాలికలు, యువతులను రక్షించడం, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, టూటౌన్ సీఐ కరీం, సీడీపీఓ వరలక్ష్మి పాల్గొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు జరిగాయి. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. పలుప్రాంతాల్లో మానవహారంగా ఏర్పడి బాలికల దినోత్సవంపై అవగాహన కల్పించారు. బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేద, మధ్యతరగతి వర్గాలకు లబ్ధి

జీఎస్టీపై మంత్రి సవిత

అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి: కలెక్టర్


జీఎస్టీ ప్రతులను చూపుతున్న మంత్రి, కలెక్టర్

గోరంట్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ జీఎస్టీ ద్వారా లబ్ధిచేకూరుతోందని మంత్రి సవిత అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఉత్పత్తితో పేదలకు డబ్బు ఆదా అవుతోందన్నారు. కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జీఎస్టీ స్లాబులు తగ్గింపు కారణంగా ప్రజలు నిత్యం ఉపయోగించే టూత్ పేస్ట్ నుంచి ఏసీ వరకు, రైతులు వినియోగించే సాగు పరికరాల నుంచి ట్రాక్టర్ వరకు ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. వస్తువులను కొనుగోలు చేసే సమయంలో గత ధర, జీఎస్టీ తగ్గిన తర్వాత ధరలు గురించి వ్యాపారులను అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మారుతిప్రసాద్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రాంగణంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, ఉద్యానవనాన్ని సందర్శించి మొక్కను నాటి ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ సమత తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన అవసరం

పెనుకొండ టౌన్(ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ మార్పుపై అవగాహన పెంచుకోవాలని మంత్రి సవిత పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలువార్డుల్లో మంత్రి పర్యటించి కరపత్రాలు పంపిణీ చేసి జీఎస్‌టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, కమిషనర్ సతీష్‌కుమార్, కన్వీనర్ శ్రీరాములు, ఎగువగడ్డ కృష్ణమూర్తి, గుట్టూరు సూరీ పాల్గొన్నారు.

ప్రతి హామీనీ నెరవేర్చాం

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని మంత్రి సవిత అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణంలో రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన ప్రజా ఆరోగ్య బ్లాక్ యూనిట్‌ను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు విషప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుగంటి చంద్ర, వెంకటరమణ, కన్వీనర్ వెంకటేశులు, డీవీ ఆంజనేయులు, సిద్ధలింగప్ప, భానుకీర్తి, సంజీవరెడ్డి, రామక్రిష్ణ, కిష్టప్ప, సూర్యనారాయణ, సూరీ, మద్దిలేటి, గట్టు మహేంద్ర, ఉప్పర బాబయ్య, కాంట్రాక్టర్ అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై సమీక్ష

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రి సవిత అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో చేపట్టాల్సిన అభివృద్ధిపై పెనుకొండ, రొద్దం నాయకులతో మంత్రి సవిత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి సమస్యలేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతి, సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, రొద్దం నాయకులు చిన్నప్పయ్య, మాధవ నాయుడు, రామక్రిష్టప్ప, నరహరి, పెనుకొండ నాయకులు యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, రాయలసీమ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి: మంత్రికి వినతి

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కబలేశ్వరపురం మండలం అంగర గ్రామంలోని గణపతి చేనేత సహకార సంఘం కార్మికులకు బకాయిపడ్డ రూ.3.84కోట్లను చెల్లించి చేనేత కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా నాయకులు నారాయణస్వామి, కార్మికులు మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీరాములు, కార్మిక సంఘం నాయకులు దేవాంగం వెంకటేశు, దాసరి సుధాకర్, బెస్త కిష్టప్ప, కురుబ శ్రీనివాసులు, ఈడిగ నాగరాజు, గోవిందప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

ఎమ్మెల్యే పీఏ వీరయ్య

మన్రో తోపు ఆక్రమణల పరిశీలన


ఆక్రమణలను పరిశీలిస్తున్న పీఏ వీరయ్య

చిలమత్తూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కోడూరులోని మన్రో తోపులో జరుగుతున్న ఆక్రమణల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కాపాడుకుందామని స్పష్టం చేశారు. ఇటీవల రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో రోడ్డు పక్కన దుకాణాలు నిర్వహిస్తున్న కొందరు మన్రో తోపులో ఆక్రమణలు చేయడానికి ప్రయత్నిస్తుండటంతో స్థానిక పంచాయతీ అధికారులు అడ్డుకుంటూ వస్తున్నారు. అయినా కొందరు అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే బాలకృష్ణకి తెలియడంతో పీఏ వీరయ్యను కోడూరు తోపులో జరుగుతున్న ఆక్రమణలను అడ్డుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతోఓ ఆయన గురువారం ఎంపీడీఓ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, రెవెన్యూ అధికారులతో కలిసి కోడూరు మన్రో తోపుని సందర్శించారు. జరుగుతున్న ఆక్రమణలను పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోను కోడూరు మన్రో తోపులో ఆక్రమణలు చేపట్టరాదని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మన్రో తోపు ఆధీనంలోని స్థలాల్లో కొందరు పక్కా భవనాలను నిర్మించుకోవడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. వెంటనే పక్కా భవనాలను నిర్మించుకున్న వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. పక్కా భవనాలను పంచాయతీ స్వాధీనం చేసుకొని నిర్వాహకుల నుంచి అద్దె వసూలు చేసే విధంగా పంచాయతీ ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు చేపట్టాలన్నారు. మన్రో తోపులో ఎన్నో ఏళ్లుగా స్థలాలను ఆక్రమించుకొని లక్షలరూపాయలకు అమ్ముకుంటున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మన్రో చింత తోపు పూర్తిగా ఆక్రమణలకు గురైందని, 43.73 ఎకరాలు ఉండాల్సిన తోపు కుచించుకుపోయిందన్నారు. కబ్జాలకు పాల్పడిన వారి నుంచి మన్రో తోపును కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన కోదండ రామాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ఎవరు కబ్జాలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వైసీపీ నాటకాలను ప్రజలు నమ్మరు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప


నిరసనలో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, కూటమి నాయకులపై నిందలు వేయడం మానుకోవాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప అన్నారు. గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా దేవరకొండలో వైసీపీకి చెందిన సర్పంచ్ అక్కడ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తే ఆ పార్టీ నాయకులు ఇతరులపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి రాక్షస ఘటనలకు వైసీపీ నాయకులే కారణమన్నారు. నిరసనలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరి గంగాధర్, టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, కౌన్సిలర్ సతీష్, నాగేంద్రమ్మ, రాఘవేంద్ర, మోదాశివ, రామాంజినమ్మ, అమర్నాథ్, షఫీ, డైమండ్‌బాబా, ప్రవీణ్ పాల్గొన్నారు.

'జీఎస్టీ ఫలాలు అందరికీ అందాలి'

హిందూపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఫలాలు అందరికీ అందాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే పీఏ వీరయ్యతో కలిసి సూపర్‌జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్‌పై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, లక్ష్మీరామనాయక్ పాల్గొన్నారు.

ఎస్పీ తనిఖీ


గుడిబండ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

అగళి, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని సూచించారు. కర్ణాటక మద్యం, గుట్కా, గ్యాంబ్లింగ్ తదితర విషయాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ రాజకుమార్, ఎస్ఐ వీరేష్‌లను ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ నరసింగప్ప ఉన్నారు.

● గుడిబండ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

గుడిబండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తహసీల్దార్ శ్రీధర్ తెలిపారు. మండలంలో ఆధార్ కార్డులో పేర్లు, తప్పొప్పులు, చిరునామా మార్పు ఉంటే సరిదిద్దుకోవచ్చని వివరించారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ కళ్యాణ్‌చక్రవర్తి, రాంభూపాల్ రెడ్డి, ఆధార్ నిర్వాహకుడు హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద రచ్చ

రోడ్డు ప్రమాద బాధితుల ఆందోళన


సీఐతో వాగ్వాదం చేస్తున్న బాధితులు

సోమందేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తన భర్త మరణించి ఆరు నెలలు గడిచినా న్యాయం చేయలేదని సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్‌బాబుతో వెలగమాకులపల్లి తండాకు చెందిన దేవిబాయి, ఆమె కుమారుడు సంపత్‌నాయక్ గురువారం వాగ్వాదానికి దిగారు. గుడిపల్లి పారిశ్రామికవాడ వద్ద వాటర్ ట్యాంకర్ ఢీకొని కృష్ణానాయక్ అనే వ్యక్తి మృతిచెందారు. దీంతో ట్యాంకర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేయాలని తాము కోరామని, పెద్దమనుషులు జోక్యం చేసుకుని పరిహారం ఇప్పిస్తామని మోసగించారని అన్నారు. పోలీసులు ఇటీవల కేసు నమోదు చేసి, చార్జిషీట్ వేశారని ఆరోపించారు. ప్రైవేటు వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, కోర్టు ద్వారా న్యాయం జరుగుతుందని సీఐ వారితో అన్నారు. తాము చట్టం ప్రకారం నడుచుకున్నామని, స్టేషన్‌లో పంచాయితీలకు తావులేదని అన్నారు. కృష్ణానాయక్ ఏప్రిల్ 26న ప్రమాదంలో మరణించారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్ తెలిపారు. ట్యాంకరును సీజ్‌చేసి స్టేషన్ వద్ద ఉంచామని తెలిపారు. నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చి, చార్జ్‌షీటు కోర్టుకు సమర్పించామని తెలిపారు. తమపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.


పంచాయితీ చేసిన పెద్దమనిషిని నిలదీస్తున్న బాధితులు

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న

- మంత్రి సవిత


వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణకు మంత్రిని ఆహ్వానిస్తున్న వడ్డెర్లు

పెనుకొండ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న అని మంత్రి సవిత కొనియాడారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గోరంట్లలో ఈనెల 26న వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి రావాలని ఆ సంఘం నాయకులు మంత్రి సవితను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వడ్డెర్లకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోరంట్ల మండల వడ్డెర్ల సంఘం నాయకులు రామాంజినేయులు, వడ్డెర సాధికార సమితి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ పల్లపు మహేంద్ర, గోరంట్ల మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ వడ్డె అమర్నాథ్, నిడిమామిడప్ప, బాలకృష్ణ, వడ్డె రమణ, శ్రీనివాసులు, హనుమన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిప్పేస్వామి


రంగధామప్ప ఆరోగ్యంపై ఆరాతీస్తున్న గుండమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండమల తిప్పేస్వామి పేర్కొన్నారు. కదిరేపల్లి గ్రామానికి చెందిన నాయకుడు రంగధామప్ప కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన గురువారం ఆ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే బలం అని అన్నారు. వారికి ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందన్నారు. అధైర్యపడకుండా ఉండాలని సూచించారు. గుండుమల తిప్పేస్వామి వెంట మండల కన్వీనర్ నాగరాజు, నాయకులు రఘురాం, శ్రీనివాసులు, కరియన్న, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే చెకుముకి

మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసభాస్కర్


పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఈఓ, జనవిజ్ఞాన వేదిక సభ్యులు

మడకశిరటౌన్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు చెకుముకి ట్యాలెంట్ టెస్ట్‌లు దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసభాస్కర్ అన్నారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ట్యాలెంట్ టెస్ట్‌లకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 18వతేదీ నుంచి పాఠశాల స్థాయి, నవంబరు 1న మండద, 23న జిల్లాస్థాయిలో 8, 9, 10 తరగతి విద్యార్థుల కోసం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీ ఎస్‌టీఏ జిల్లా అధ్యక్షులు మారుతీప్రసాద్, జేవీవీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు రమేష్, మంజునాథ్, ఉమేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు: తహసీల్దార్


విచారణ చేస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌకధాన్య దుకాణాలకు వచ్చే కార్డుదారులతో డీలర్లు గౌరవంగా మాట్లాడాలని, ఏవైనా ఫిర్యాదులు వస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ అన్నారు. గురువారం స్థానికంగా ఉన్న ప్రభుత్వ చౌకధాన్య డిపోను ఆమె తనిఖీ చేశారు. డీలర్ చంద్రమౌళి దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, సమయానికి సరుకు ఇవ్వడంలేదని పలువురు అతనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె తనిఖీ చేశారు. విచారణ చేపట్టారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదు రావడంతో వారి ముందే ఆయన తీరుపట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని వినియోగదారులకు సర్దిచెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రాజేష్, ఆర్ఐ భారతి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారులకు నోటీసులు

మడకశిరటౌన్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అవకతవకలకు పాల్పడిన ఉద్యోగులకు సంబంధించి మరోమారు విచారణకు రావాలని గురువారం నోటీసులు జారీ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 2020లో కోడిగుడ్ల సరఫరాలో అవకతవకలు జరిగాయని అప్పట్లో విధులు నిర్వహిస్తున్న సీడీపీఓ విజయకుమారి, సూపర్‌వైజర్లు లీల, పద్మావతి, అరుణమ్మ, సన్నక్కపై ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారణ చేపట్టారు. చర్యలు మాత్రం తీసుకోలేదు. ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ అధికారులకు విచారణ నిమిత్తం గురువారం నోటీసులు జారీ అయ్యాయి.